52

ధారావాహిక



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి
99893 71284

**జరిగిన కథ :** వివాహానంతరం.. అత్తవారింట మూడేళ్లు గడిపాడు గణపతిదేవుడు. ఇద్దరు భార్యలతో సుఖ సంతోష విహార విలాసాదులతో పరవశించాడు. ఆ సమయంలోనే.. మళ్లీ యుద్ధభేరి మోగించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నెల్లూరిసీమ నుంచి మనుమసిద్ధి ప్రతినిధిగా ఆయన కుమారుడు తిక్క భూపాలుడు.. ఒకరోజు తలగడదీవి కోటకు వచ్చాడు. తమిళజం పాలకుడు చోళ రాజు మూడవ కులోత్తుంగచోళుడు.. మనుమసిద్ధిని సింహాసన భ్రష్టుణ్ని చేసి, తమ్ముళ్ల వరసైన నల్లసిద్ధిని, తమ్మసిద్ధిని విక్రమసింహపురం పాలకులను చేసినట్లు చక్రవర్తికి విన్నవించాడు తిక్క భూపాలుడు.

‘‘మా వివాహానికి విచ్చేసిన మనుమసిద్ధి మహా రాజులు మాతో ఎందుకు చెప్పలేదు తిక్క భూపాలా?!’’ అన్నాడు ఆవేదనగా చక్రవర్తి గణపతిదేవుడు.

‘‘వివాహవేళ యుద్ధ సంగతులా! అని తమరికి విన్న వించలేదు ప్రభూ! వారి ఆగడాలు రోజురోజుకూ మితి మీరి పోతున్నాయి. ఇక భరించలేక తండ్రిగారు తమరి సాయం అర్థించడానికి నన్నే స్వయంగా పంపారు ప్రభూ!’’ చెప్పాడు తిక్క భూపాలుడు.

‘‘మరి.. చోళుడు! ఆయన అభిప్రాయం ఏమిటి భూపాలా?’’.

‘‘అసలు దుర్మార్గుడు వాడే ప్రభూ! ఇప్పుడు వాడికి తమిళ రాజ్యం పిచ్చి బాగా తలకెక్కింది. విక్రమసింహ పురం ఉత్తర భాగం పొత్తపినాడు వరకు తమిళ రాజ్యాన్ని విస్తరించాలని వాడి పన్నాగం!’’.

దిగ్గున లేచాడు గణపతిదేవుడు.

‘‘కంచి పట్టణం, కావేరి తీరప్రాంతం, తొండ మండలం, మొరసునాడు వరకు తెలుగు మాట్లాడే ప్రజలున్న ప్రాంతాలు. అవి ఆంధ్ర సామ్రాజ్యంలో భాగాలు. వాటిని ఆక్రమించడమే కాకుండా పొత్తపి నాడు వరకూ హద్దులు నిర్దేశిస్తాడా తమిళ రాజ్యానికి?! అదెట్లా సాధ్యమో మేమూ చూస్తాం. మీకిదే మా అభయం. మీకు పూర్తి బాసటగా కాకతీయ చక్రవర్తి ఉన్నాడని మరచిపోవద్దని తండ్రిగారికి విన్నవించండి. చోళునికి మేం విన్నవిస్తాం.. కరవాలాల శబ్దాలతో!’’.

ఆ తర్వాత ద్వీపరాజు పినచోడుణ్ని పిలిచి..

‘‘అనుమకొండకు వార్త పంపండి. సకలసేనాపతి రుద్రసేనానివారికి మా మాటగా చెప్పండి. దక్షిణదిశగా యుద్ధానికి వెళ్లాలి. ద్వీప సైన్యమంతా సిద్ధమా!? సంసిద్ధతకు ఎంతసమయం కావాలి?’’.

పినచోడుడు అయోమయంగా చూశాడు.

గణపతిదేవుని తేజరిల్లుతున్న ఆలోచనా స్రవంతులను చూశాక.. కొడుకు జాయపుని వంక చూశాడు. జాయపుడు ఊపిరి కూడా పీల్చడం లేదు.

మారుమాట్లాడకుండా తల ఊపి.. వెనక్కి నడచి నిష్క్రమించాడు పినచోడుడు.

చక్రవర్తి అంతవేగంగా తిరిగి రాజ్య సమస్యల్లోకి రావడం జాయపుణ్ని ఆశ్చర్యపరచింది.

ఆనాటి సంధ్యవేళ మరో కొత్త గణపతిదేవుణ్ని చూశాడు జాయపుడు.

తలగడదీవి సముద్ర తీరంలో ఇద్దరూ వాహ్యాళిగా నడుస్తున్నారు.

‘‘ఈ నెల్లూరి రాజ్య గొడవలు ఏమిటి? ఈ చోడ.. చోళ.. రాజుల కథ ఏమిటి దేవరా!?’’ అడిగాడు జాయపుడు.

‘‘తెలుగు మాట్లాడితే చోడ, తమిళం మాట్లాడితే చోళ. తనకు సామంతుడిగా ఉండటానికి ఇష్టపడని మనుమసిద్ధిని తొలగించి, తనమాట వినే నల్లసిద్ధిని సింహాసనంపై కూర్చోబెట్టాడు చోళుడు. ఇదే ప్రాంతీయ తత్వం..’’ విపులంగా చెప్పాడు గణపతిదేవుడు.

ఈ దృక్కోణం జాయపునికి కొత్త. గతంలో నాగం